సమగ్ర సస్యరక్షణే కీలకం

- ఆశాజనకంగా అపరాల సాగు
- యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సిబ్బంది



ఎల్.కోట మండలం ఖాసాపేట సమీపంలో పెసర పంటకు పురుగు మందు పిచికారీ చేస్తున్న రైతు



ఎల్.కోట మండలం గొల్జాంలో ఆశాజనకంగా ఉన్న పెసర పంట



కొత్తవలస మండలం దెందేరులో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మాధురీశరణ్య (ఫైల్)

ఎస్.కోట నియోజకవర్గంలో అపరాల సాగు వివరాలు హెక్టార్లలో...

మండలం	పెసర	మినప
ఎల్.కోట	720	880
ఎస్.కోట	691	722
వేపాడ	648	722
కొత్తవలస	42	286
జామి	943	1286

కొత్తవలస: ఎస్.కోట నియోజకవర్గంలో అపరాల సాగు ఆశాజనకంగా ఉంది. ఖరీఫ్ వరి నాట్లు వేసిన పొలాల్లో పంట కోతకు ముందు రైతులు పెసర, మినప విత్తనాలు చల్లారు. అయితే మొక్కలు ప్రారంభ దశలో ఉన్నప్పుడు కురిసిన వర్షాలు అక్కడక్కడా పంటకు నష్టం చేశాయి. ప్రస్తుతం పంటకు అనుకూల వాతా వరణం ఉందని సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడు లు సాధించవచ్చని కొత్తవలస సబ్‌డివిజనల్ వ్యవసాయాధికారి ఎల్.విజయ సూచి స్తున్నారు. ప్రస్తుతం పైరుకు కొన్నిరకాల చీడపీడలు సోకుతున్నాయని, రైతులు వీటిని సకాలంలో గుర్తించి వ్యవసాయ సిబ్బంది సలహాల మేరకు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని చెబుతున్నారు. గత 15 రోజులుగా దట్టంగా మంచు కురుస్తుండడం వల్ల పైరును త్రిప్ అనే పురుగు ఆశించే అవకాశం ఉందని, ఈ పురు గు పూతను తినేస్తుందని, నివారించకుంటే నష్టం తప్పదని అంటున్నారు. నివారణకు లీటరు నీటిలో 2 మిల్లీలీటర్ల పిప్రోనిల్ మందును కలిపి, ఎకరాని 400 మిల్లీలీటర్ల మందును పిచికారీ చేయాలని సూచిస్తున్నారు. ముందుగా పంట వేసిన చోట చేనులో కాయతొలచు పురుగు అధికంగా ఉంటుందని, నివారణ కు లీటరు నీటిలో 2.5 మిల్లీలీటర్ల క్లోరోపైరిపాస్ మందును కలిపి ఎకరానికి అరలీటర్ మందు పిచికారీ చేసుకోవాలని వివరించారు. గ్రామాల్లో వ్యవసాయ సిబ్బంది క్షేత్రస్థాయిలో అపరాల పంటలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ చీడపీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇంకో వారం,పది రోజుల పాటువాతావరణం అనుకూలిస్తే మంచి దిగుబడులు వస్తాయని వ్యవసాయ అధికారులు అంటున్నారు.

ఉత్సాహంగా ఎడ్ల పరుగు ప్రదర్శన



ఎడ్ల పరుగు ప్రదర్శనను తిలకిస్తున్న ప్రజలు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేటలో గ్రామదేవత పరదేశమ్మ తీర్థం సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఎడ్ల పరుగు ప్రదర్శన ఉత్సాహంగా సాగింది. పోటీల్లో విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన 12జతల ఎడ్లు పాల్గొన్నాయి. దేవరాపల్లికి చెందిన జైవీరాంజనేయ ఎడ్లు మొదటి స్థానంలో, వావిలపాడుకు చెందిన మరిడిమాంబ ఎడ్లు ద్వితీయస్థానంలో, వల్లంపూడి సిద్ధి వినాయక ఎడ్లు మూడో స్థానంలో నిలిచాయి. సంబంధిత ఎడ్ల యజమానులకు నిర్వాహకులు నగదు బహుమతులు అందజేశా రు. అమ్మవారికి ఉదయం నుంచి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు పసుపు, కుంకుమ, చీరలు సమర్పించి మొక్కు లు చెల్లించుకున్నారు. మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు వేచలపు చినరాము నాయుడు, మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటరావు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆతవ గ్రామస్తుల ఆందోళన విరమణ



ఆతవ గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘురాజు

వేపాడ: వేపాడ–సోంపురం ప్రధాన రహదారి నుంచి ఆతవ గ్రామానికి తారురోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని కోరుతూ ఆ గ్రామస్తులు ఏడు రోజులుగా చేపట్టిన ఆందోళన కార్యక్రమాలను ఆదివారం విరమించారు. గ్రామస్తులు నిరసన తెలుపుతున్న శిబిరం వద్దకు ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, తహసీల్దార్ రాములమ్మ, ఎంపీడీఓ సూర్యనారాయణ, పీఆర్ పీఐయూడీఈ సత్యనారాయణమూర్తితో కలిసి వెళ్లి ఆందోళనకారులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో నిధులు మంజూరైనప్ప టికీ కొన్ని సాంకేతిక కారణాల వల్ల రోడ్డు నిర్మాణం ఆలస్యమైందని రఘురాజు వారికి చెప్పారు. పనులు త్వరగా ప్రారంభించా లని సంబంధిత కాంట్రాక్టర్‌తో తాను మాట్లాడానని, రోడ్డు వేయించే బాధ్యత నాదని, పదిరోజుల్లో పనులు ప్రారంభించేలా చూస్తానని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు శాంతించి ఆందోళన విరమిస్తున్నట్లు ప్రకటించారు. అంతకు ముందు సర్పంచ్ వేమన నాయుడు, వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు, సీపీఎం నాయకుడు చల్లా జగన్, ఉద్యమ నాయకులు కర్రి దేముడు, ఉదయ్ భాస్కర్, గ్రామపెద్దలు, మహిళలతో కలిసి ఆతవ రోడ్డును రఘురాజు, అధికారులు పరిశీలించారు.

కార్మికుల హక్కుల కోసం నిరంతర పోరాటం



ఆటో యూనియన్ సభ్యులతో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

గజపతినగరం: కార్మికుల హక్కుల కోసం సీఐటీయూ నిరంతరం పోరాటం చేసేది సీఐటీ యూనేనని ఆయూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్ తెలిపారు. మండలంలోని కొనిశ గ్రామ జంక్షన్ వద్ద ఉన్న ఓ మామిడి తోటలో ఆదివారం ఆటో యూనియన్ కార్మికుల సమావేశం నిర్వహించారు. మెంటాడ జంక్షన్‌కు చెందిన శ్రీలక్ష్మీ కనకదుర్గ ఆటో యూనియన్ నుంచి 120మంది సీఐటీయూలో చేరారు. ఈసందర్భంగా సురేష్ మాట్లాడుతూ సీఐటీయూ దేశవ్యాప్తంగా రవాణా రంగంలో పని చేస్తున్న కార్మికుల హక్కుల కోసం పోరాడడమే కాకుండా, కార్మికులను చైతన్యవంతులను చేసేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని చెప్పారు.రవాణా రంగంలో పని చేస్తున్న ప్రతీ కార్మికుడి శ్రమ వెనుక దేశ ప్రయోజనాలు దాగి ఉన్నాయని అన్నారు. రవాణా రంగ కార్మికులను ఆదుకోవడానికి కేరళ తరహా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు ఇష్టానుసారం డీజిల్,పెట్రోల్ ధరలను పెంచుతున్నాయి కానీ రవాణా రంగంపై ఆధారపడే వారి సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని, కనీసం ఆటోలు నిలిపేందుకు ప్రధాన జంక్షన్‌లలో చోటు చూపించలేకపోతున్నాయని మండిపడ్డారు. రవాణా రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మార్చి14న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని చేపట్టనున్నామని,ఆటో డ్రైవర్లంతా తరలిరావాలని కోరారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు బాలి రాము,ఉపాధ్యక్షుడు కాళ్ల రామానంద, కార్యదర్శి రెట్టంగి భాస్కరరావు, సభ్యులు కె.రమణ, సీతం నాయుడు,శంకరరావు,పూర్ణచంద్రరావు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు పీడీఎస్ బియ్యం వేలం

చీపురుపల్లి: స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలో గల మండలాల్లో 6–ఏ కేసుల్లో సీజ్‌చేసిన 52.958 మెట్రిక్ టన్నుల రేషన్(పీడీఎస్) బియ్యంను సోమ వారం వేలం వేయనున్నట్లు తహసీల్దార్ ఎన్.రాజారావు ఆదివారం ఓ ప్రకటన లో తెలిపారు. బియ్యం వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. పట్టణంలోని ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఉదయం 10.30 గంటలకు వేలం ప్రారంభమ వుతుందని, ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

రోడ్డుపైనే మురుగు ప్రవాహం



వేపాడ-వల్లంపూడి గ్రామాల మధ్య రోడ్డు మీద ప్రవహిస్తున్న మురుగు నీరు

వేపాడ: మండల కేంద్రమైన వేపాడ- వల్లంపూడి జంటగ్రామాల మధ్య శివాలయం వీధిలో మురుగునీరు రోడ్డుపై నుంచే ప్రవహిస్తుండడంతో స్థానికులు, ఆ మార్గంలో ప్రయాణించే వారు ఇబ్బందులు పడుతున్నారు. సైడు కాలువల్లో పూడిక, చెత్త పేరుకు పోవడంతో మురుగునీరు పొంగిపోయి రోడ్డు మీదకు చేరుతోంది. కాలువలో చెత్త కుళ్లిపోయి దుర్గంధం వెదజల్లుతోందని, దోమలు వృద్ధి చెంది రాత్రివేళల్లో నిద్రలేకుండా చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఈప్రాంతం వేపాడ పంచాయతీ పరిధిలోనిదని వల్లంపూడి పంచాయతీవారు, కాదు వల్లంపూడి పంచాయతీదని వేపాడ పంచాయతీ వారు వంతులు వేసుకుంటూ పారిశుద్ధ్య పనులు చేయడం లేదని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పారిశుద్ధ్య పనులు చేయించాలని కోరుతున్నారు. సమస్యను ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ మహేష్ వద్ద సాక్షి ఫోన్‌లో ప్రస్తావించగా, సమస్య తన దృష్టికి రాలేదన్నారు. తక్షణమే పారిశుద్ధ్య పనులు చేయించి సమస్య పరిష్కారిస్తామని చెప్పారు.

ఇంటింటికీ భగవద్గీత పుస్తకాలు



భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేస్తున్న కోటేశ్వరరావు, తదితరులు

శంగవరపుకోట: భగవద్గీత పఠనం ప్రతి భారతీయుని కర్తవ్యమని ప్రజలకు అవగాహన కల్పిస్తుండడంతో ఇంటింటికీ భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేస్తున్నామని ఎస్.కోటలోని మోక్షవిద్య యోగమందిర్ నిర్వాహకులు శీల కోటేశ్వరరావు చెప్పారు. ఆదివారం సాయంత్రం సంస్థ కార్యకర్తలతో కలిసి పట్టణంలోని చైతన్యనగర్ కాలనీలో గృహస్తులకు భగవద్గీత పుస్తకాలు అందజేశారు. ఈసందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ దాతల సహాయ, సహకారాలతో ఈ కార్యక్రమాన్ని నిర్వ హిస్తున్నామని, పుస్తకాలు కావాల్సిన వారు 99893 68781, 98667 57311 నంబర్లను సంప్రదించాలని సూచించారు. యోగమందిర్ గౌరవసలహాదారు టి.అప్పారావు, సహాయ కార్యదర్శి ఆర్.కిశోర్, దదితరులు పాల్గొన్నారు.

ఇది పెట్టుబడిదారుల బడ్జెట్



కొత్తవలస: గాంధీనగర్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

కొత్తవలస: కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి తీవ్రఅన్యాయం జరిగిందని, పేదలు, కార్మికులు, రైతులకు ఈ బడ్జెట్ ఏమాత్రం అను కూలంగా లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గాడి అప్పారావు విమర్శించారు. సీపీఎం ఆధ్వర్యంలో మండలంలోని గాంధీనగర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా అప్పారావు మాట్లాడుతూ ఇది పెట్టుబడిదారుల బడ్జెట్ అని, సామాన్య ప్రజానీకానికి,రైతులు,పేదలకు ఈ బడ్జెట్‌తో ఒరిగేదేమీ లేదన్నారు. బీజేపీ పాలనలో శ్రామిక,కార్మిక,కర్షక రంగాల్లో వృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని, పెట్టుబడిదారులు మాత్రం అంతకంతకూ ఎదిగిపోతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మద్దిల రమణ, వంక ఆదినారాయణ,తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ రంగానికే ప్రయోజనం

బొండపల్లి: సామాన్య ప్రజానీకాన్ని గాలికి వదిలేసి, కేవలం కార్పొరేట్ రంగానికి ప్రయోజనం చేకూర్చే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ ఉందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రాకోటి రాములు ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. రాష్ట్రా నికి ఎలాంటి కేటాయింపు లూ లేకపోయినప్పటికీ బడ్జెట్ చాలా బాగుందని టీడీపీ, జనసేన నాయకులు మాట్లాడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేకంగా ఏ నిధులు కేటాయించారో కూటమినాయకులు చెప్పాలని డిమాండ్ చేశారు. జిల్లాలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణా నికి ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని, అలాగే ఉత్తరాంధ్రకు సంబంధించిన ఒక్క సాగునీటి ప్రాజెక్టుకూ నిధులు కేటాయించ లేదని విచారం వ్యక్తం చేశారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా విస్మరించారని, తీవ్ర సంక్షోభంలో ఉన్న రైతులను ఆదుకునే చర్యలేవీ ఈ బడ్జెట్‌లో తీసుకోలేదని ఆరోపించారు. ఈ బడ్జెట్ కార్పొరేట్ రంగానికే తప్ప సామాన్యప్రజలకు కాదని విమర్శించారు.

జిల్లా బీజేపీ అధ్యక్షుడికి సన్మానం



రాజేష్‌వర్మను సన్మానిస్తున్న బీజేపీ కార్యకర్తలు

గుర్ల: జిల్లా బీజేపీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారి తన స్వగ్రామం పల్లిగండ్రేడుకు వచ్చిన ఉప్పలపాటి రాజేష్‌వర్మకు గ్రామస్తులు ఆదివారం ఘన స్వాగతం పలికి, అభినందనలు తెలిపారు.ఆయన్ని పార్టీ కార్యకర్తలు కలిసి సన్మానించారు.

ఆర్యవైశ్యులకు రక్షణ కల్పించండి



ఎస్ఐకి వినతిపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్యులు

శృంగవరపుకోట: పట్టణంలో ఇటీవల ఆర్యవైశ్యులపై దాడులు పెరిగిపోయాయని, రక్షణ కల్పించాలని కోరుతూ ఆర్యవైశ్య సంఘ సభ్యులు ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఎస్.కోట దేవీ జంక్షన్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఎస్ఐకి వినతిపత్రం అందజేశారు. ఈసం దర్భంగా వారు మాట్లాడుతూ నెల రోజుల వ్యవధిలో పట్టణంలో జరిగిన పలు దొంగతనాలు, దోపిడీల్లో ఆర్యవైశ్యులు నష్టపోయారన్నా రు. వ్యాపారులపై దాడులు నియంత్రించాలని, దొంగతనాలకు, దోపిడీలకు అడ్డుకట్ట వేయాలని, స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో వ్యాపారం చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు, ఆర్యవైశ్య మహాసభ సభ్యుడు హెచ్.నానాజీ, వర్తక సంఘం అధ్యక్షుడు కొల్లా శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు కె.వెంకటేష్, వ్యాపారులు తోట వాసు, కొనగల్ల శ్రీను, చెక్క కిరణ్, కాపుగంటి వాసు, పి.సాయిరాం, ఉప్పల విజయ్‌కుమార్, విజ్జపు సతీష్, వాసవి క్లబ్ ప్రతినిధులు ఎం.శివకుమార్, వేమూరు శ్రీనివాస్, బాలనాగు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ జంబోరిలో సోంపురం విద్యార్థులు



తిరుచిరాపల్లిలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రాజెక్టులు ప్రదర్శిస్తున్న సోంపురం హైస్కూల్ విద్యార్థులు



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

వేపాడ: మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లిలో నిర్వహించిన భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ జంబోరి కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని ఆ పాఠశాల హెచ్ఎం బి.పి.ఎ.రాజు ఆదివారం తెలిపారు. పాఠశాల అడ్వాన్స్ స్కౌట్ మాస్టారు పి.రమేష్‌నాయుడు ఆధ్వర్యంలోసేవా శ్రీ స్కౌట్ యూనిట్ విద్యార్థులు చైతన్య, సుధీర్, ఎర్నాయుడు, రోహిత్, అజయ్‌శశివర్ధన్, గైడ్‌కెప్టెన్ నాయిమున్నీషా, రుద్రమదేవి గైడ్ యూనిట్ విద్యార్థినులు హాసిని, ధనుశ్రీ, మేఘన, హైందవి, స్వరూప తదితరులు ఈ ఉత్సవాలకు వెళ్లారన్నారు. జనవరి 28న ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఫిబ్రవరి 3వ తేదీ వరకు జరుగుతాయని చెప్పారు. అక్కడ నిర్వహించే గైడ్స్, అడ్వెంచర్, సైన్స్ ఎగ్జిబిషన్, పరేడ్, పయోనీరింగ్, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులు ప్రతిభ కనబరుస్తున్నారని తెలిపారు.

వారికి ఎన్నికల కోడ్ వర్తించదా..?



దావాలపేట రోడ్డులో టీడీపీ నేతల ఫొటోలతో ఫ్లెక్సీలు



గజపతినగరం బ్రిడ్జి వద్ద టీడీపీ నేతలు, కార్యకర్తల ఫొటోలతో ఫ్లెక్సీ

గజపతినగరం: జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నప్పటికీ మండలంలో అధికార పార్టీ వారికి మాత్రం అది వర్తించదు అన్నట్లు ఉంది పరిస్థితి. మండల కేంద్రంలో ఎక్కడికక్కడ తెలుగు దేశం పార్టీ నేతల ఫ్లెక్సీలు ఇంకా దర్శనమిస్తునే ఉన్నాయి. జెడ్పీటీసీ సభ్యుడు గార తవుడు ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధికారులు టీడీపీ వారి ఫ్లెక్సీలు తొలగించకుండా వైఎస్సార్ సీపీకి చెందిన ఫ్లెక్సీలనే తొలగిస్తున్నారని, ఇది ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఎన్నికల కోడ్ అంద రికీ ఒకేలా వర్తిస్తుందని, అధికారులు అన్ని రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. ఈ విషయం తహసీల్దార్ రత్నకుమార్ వద్ద సాక్షి ప్రస్తావించగా పార్టీ ఆఫీస్ వద్ద, ప్రైవేటు స్థలంలో ఎవరైనా ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకోవచ్చని, ప్రభుత్వ స్థలాల్లో ఫ్లెక్సీ మాత్రం కచ్చితంగా తొలగిస్తామని చెప్పారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గజపతినగరం : 9010204447 | చీపురుపల్లి : 9010133309 | ఎస్.కోట : 9951602965
Office mail : vzmadvt@gmail.com

క్లుప్తంగా

ఆర్థిక సహాయం



రమణ కుటుంబ సభ్యులకు చెక్ అందజేస్తున్న గోవిందరాజులు, తదితరులు

చీపురుపల్లి: ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించిన పట్టణానికి చెందిన ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుం బానికి అమెరికాకు చెందిన సహృదయ ఫౌండేషన్ అధ్యక్షురాలు తాడివాక బిందు రూ.50 వేల ఆర్థి క సహాయం చేశారు.ఆమె పంపించిన చెక్‌ను ఆశయ రమణ కుటుంబ సభ్యులకు మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు బి.వి.గోవిందరాజుల ఆధ్వర్యంలో ఆదివారం అందజేశారు.ఉపాధ్యా యులు డోల నాగరాజు, ఎస్.వి.అప్పలనాయుడు, ఆశయ సంస్థ కార్యదర్శి మీసాల లక్ష్మణరావు, బూరాడ నవీన్, తదితరులు పాల్గొన్నారు.

సతీష్‌కు తెలుగు వెలుగు నంది పురస్కారం



అతిథుల చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సతీష్

వేపాడ: మండలంలోని నీలకంఠరాజపురం గ్రామానికి చెందిన సంగీత కళాకారుడు చీపురుపల్లి సతీష్‌ను తెలుగు వెలుగు నంది పురస్కారం వరించింది. స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో భాగంగా విజయవాడకు చెందిన తెలుగు వెలుగు సాహితీ వేదిక 2025కు ఆయన్ని ఉత్తమ సంగీత కళాకారుడిగా(కీబోర్డు) ఎంపిక చేసి అవార్డు ప్రధానం చేసింది.విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆది వారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన్ని అతిథులు సన్మానించి, పురస్కారం అందజేశారు. సతీష్‌కు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

వైద్యఖర్చులకు ఆర్థికసాయం



బాధితుడికి నగదు అందజేస్తున్న గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు

వేపాడ: మండల కేంద్రానికి చెందిన కడారి అంకుశం అనే వ్యక్తి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దే వైద్యం చేయించుకుంటున్నారు. గ్రామానికి చెందిన గోల్డెన్ హార్ట్ ట్రస్ట్ సభ్యులు ఆయనకు వైద్యఖర్చుల నిమిత్తం ఆదివారం రూ.10వేలు అందజేశారు.అలాగే గ్రామానికి చెందిన మరోదాత బోజంకి లక్ష్మణరావు రూ.10 వేలు సహాయం చేశారు. దాతలకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

శతశాతం ఫలితాలు సాధించాలి

- జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పెంటోజీరావు



విద్యార్థులకు సూచనలిస్తున్న జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పెంటోజీరావు

నెల్లిమర్ల రూరల్: పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధించాలని, ఆ దిశగా సిబ్బంది, విద్యార్థులంతా కృషి చేయాలని జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పెంటోజీరావు సూచించారు. మండలంలోని మొయిద విజయరామపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 13 బీసీ బాల,బాలికల వసతిగృహాలకు చెందిన 100 మంది విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రేరణ, పునశ్చరణ తరగతులను ఆయన ఆదివారం తనిఖీ చేశారు. పరీక్షలకు తక్కువ సమయం ఉన్నందున చక్కని ప్రణాళిక వేసుకుని బాగా చదవాలని విద్యార్థులకు తెలిపారు. ఒత్తిడి లేని చదువు శ్రేయస్కరమని, ఆ దిశగా విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సంక్షేమ అధికారులు రాజులమ్మ, యశోదనరావు, కృష్ణవేణి, కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

• వర్షంలా.. పొగమంచు



గజపతినగరంలో ఉదయం 8గంటల సమయంలో లైట్లు వేసుకుంటూ రాకపోకలు సాగిస్తున్న వాహన చోదకులు

బొండపల్లి ,గజపతినగరం మండలాల వ్యాప్తంగా శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం ఉదయం తొమ్మిది గంటల వరకు దట్టమైన పొగమంచు కురుస్తునే ఉంది. రోడ్లను మంచు కమ్మేయడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహన చోదకులు అవస్థలు పడ్డారు. పగలే లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. కొద్దిరోజులుగా మంచు వర్షంలా కురుస్తుండడంతో జీడి, మామిడి తోటల్లో పూత మాడిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

– బొండపల్లి/గజపతినగరం



గజపతినగరంలోని మెంటాడ జంక్షన్ రోడ్డులో కురుస్తున్న మంచు



బొండపల్లిలో అపరాల పంటపై కురుస్తున్న పొగమంచు